క్లుప్తంగా

17న సీతారాముల కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు మిషన్ నిర్వాహకులు స్వామిని సుప్రేమానంద సరస్వతి తెలిపారు. 9 నుంచి 16వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అష్టోత్తర శతనామావళి, ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు.

సీపీఎం ఇంటింటా ప్రచారం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలువనున్న డి.గౌస్‌దేశాయ్ విజయం కోసం సీపీఎం నాయకులు ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆదివారం 12వ వార్డు పరిధిలోని డబరాలో ఆ పార్టీ నాయకులు డి.అబ్దుల్‌దేశాయ్, గోవిందు ప్రచారం చేశారు.

మే డేను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): మే 1వ తేదీన నిర్వహించే మే డే వేడుకలను జయప్రదం చేసేందుకు ప్రతి కార్మికుడు తనవంతు సహకారం అందించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నగర అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తోందన్నారు. వెంటనే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు.

ఆర్‌యూ స్కాలర్‌కు డాక్టరేట్ ప్రదానం


లితేష్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి కర్నూలుకు చెందిన లితేష్‌కు మేనేజ్‌మెంట్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పుచ్చా వెంకట సుందరానంద తెలిపారు. వర్సిటీ ఎంబీఏ హెచ్‌ఓడీ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో 'కమాడిటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్ ఇన్ ఇండియా – ఎ స్టడీ విత్ రిఫరెన్స్ టు ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ ఇన్ రాయలసీమ రీజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ అవార్డు వచ్చినట్లు వెల్లడించారు. ఆర్‌యూలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌లో మొట్ట మొదటి రెగ్యులర్ పీహెచ్‌డి డిగ్రీకి పర్యవేక్షకులుగా వ్యవహరించిన ఆచార్య విశ్వనాథరెడ్డిని, స్కాలర్ లితేష్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న అభినందించారు.


రాయపాటి శ్రీనివాస్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్‌కు ఉత్తమ సేవా అవార్డు లభించింది. 2022–23 సంవత్సరానికి గాను విశిష్ట సేవలు అందించిన లయన్స్ క్లబ్‌లకు అవార్డుల ప్రదాన కార్యక్రమం ఆదివారం ప్రొద్దుటూరులో జరిగింది. ఆ సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధిగా రాయపాటి శ్రీనివాస్ జిల్లా గవర్నర్ ఏరియా రెప్రజెంటేటివ్‌గా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేస్తామన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : ది ఫ్యామిలీ స్టార్, మంజుమ్మల్ బాయ్స్, టిల్లు స్క్వేర్, గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ : ది న్యూ ఎంపైర్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : ది ఫ్యామిలీ స్టార్, మంజుమ్మల్ బాయ్స్, టిల్లు స్క్వేర్ గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ : ది న్యూ ఎంపైర్, భరత నాట్యం
ఐనాక్స్ : గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ : ది న్యూ ఎంపైర్, ది ఫస్ట్ ఓమెన్ క్రూ (2024), బహుముఖం – గుడ్, బ్యాడ్, ది యాక్టర్, భరత నాట్యం
శ్రీరామ : ది ఫ్యామిలీ స్టార్
రాజ్ : గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ : ది న్యూ ఎంపైర్
భరత్ కాంప్లెక్స్ : ప్రేమలు

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం


ఎన్నికల ప్రచారంలో ఇస్త్రీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని, శివనరసింహారెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 41వ వార్డులో ఎన్నికల ప్రచారం

కల్లూరు: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 41వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం చేశారు. వార్డులో వృద్ధులను, మహిళలను, వివిధ వృత్తుల వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్పపాదయాత్రలో ప్రజల ఇబ్బందులను చూసి వారి అభివృద్ధికి నవరత్నాల పథకాలు తీసుకువచ్చారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాప్రతినిధులందరినీ ప్రజల దగ్గరకు పంపించారని చెప్పారు. దీంతో ప్రజాప్రతినిధులు ప్రభుత్వం చేసిన మేలు వారికి వివరించడంతో పాటు ఇంకా అవసరమైనవి ఏమైనా ఉంటే తెలియజేసే అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు అరుణ, నాయకులు కవినాథ్‌రెడ్డి, భీమా శంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవ స్వామి, గంగులు, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

కల్లూరు అర్బన్‌లోని పందిపాడు గ్రామానికి చెందిన దాదాపు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆదివారం ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో పందిపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నాగభూషణం, వెంకటేశ్వర్లు, రాజు, పర్ల వెంకటేశ్వర్లు, బోయ కృష్ణ, శంకర్, చిన్నరాజు, పెద్దరాజు, సురేష్, ధనుంజయ, సూరి పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వలన మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా అడుగుతున్నారన్నారు. కార్యక్రమంలో కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్ టీయూ నాయకులు భీమేష్‌రెడ్డి, రామకృష్ణా యాదవ్, ఆదినారాయణరెడ్డి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ


తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: శ్రీ క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్లను శ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదివారం కర్నూలు నగరంలో ఆవిష్కరించారు. క్యాలెండర్ల ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ శుభాలు కలగా లని ఆకాంక్షించారు. అనంతరం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు కర్నూలు నగరంలో పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి–ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు, కల్లూరు కమిటీల అధ్యక్షులు, సభ్యులు నాగయ్య, పురుషోత్తం, గంగాధర్,మహేష్, వాసు, మధువాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం


కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. ఫస్ట్‌స్టెప్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ శంకరశర్మ సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా వేసవి కంప్యూటర్ శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకరశర్మ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాసి ఖాళీగా ఉన్న విద్యార్థులు వేసవిలో సమయం వృథా చేయకుండా కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు వేసవి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో ప్రస్తుతం డిజిటలైజేషన్ అములులో ఉందని, ఇందులో రాణించాలంటే మొదటి అడుగు కంప్యూటర్‌లో పరిజ్ఞానం ఉండాలని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవడం ద్వారా పోటీ ప్రపంచంలో రాణించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఫస్ట్‌స్టెప్ కంప్యూటర్స్ శిక్షణా సంస్థ అధినేత ఎస్. రాజశేఖర్, మేనేజర్ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలి అలవరచుకోవాలి


డాక్టర్ లక్ష్మణస్వామిని సన్మానిస్తున్న వైద్యులు, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): గుండెజబ్బుల రోగుల సంఖ్య అధికమైన ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవనశైలి అలవర్చుకోవాలని ప్రముఖ గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ లక్ష్మణస్వామి చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో బైపాస్ సర్జరీపై ఆరోగ్యఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణస్వామి మాట్లాడుతూ ఇటీవల కాలంలో గుండెపోటు బాధితుల సంఖ్య అధికమైందన్నారు. యుక్త వయస్సు వారిలోనూ గుండెపోటు బాధితులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ పరిస్థితులు, మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం వంటివి దీనికి కారణాలుగా చెప్పారు. తమ వద్దకు వస్తున్న వారిలో ఎక్కువగా గుండెకు వెళ్లే రక్తనాళాలు బ్లాక్ అయి ఉంటున్నాయన్నారు. వారి లక్షణాలు, ఆరోగ్యస్థితిని బట్టి మందులు ఇవ్వడం, స్టెంట్ వేయడం, శస్త్రచికిత్సలు నిర్వహించడం చేస్తున్నామన్నారు. గుండె సమస్యలు తెచ్చుకునేకంటే రాకుండా నివారించుకోవడమే మేలన్నారు. అనంతరం ఆయనను కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీ ప్రసాద్, చంద్రశేఖర కల్కూర, ట్రెజరర్ కేపీ రాముడు, సభ్యులు ఘనంగా సన్మానించారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నరసింగరావు



మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

కర్నూలు(సెంట్రల్): మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు కార్మికులు, కర్షకులు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పీఎస్‌రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక, కర్షక భవన్‌లో ప్రభుత్వ విధానాలపై ట్రేడ్ యూనియన్ల వర్కుషాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ వచ్చిన తరువాత కార్మికులను బానిసలుగా మార్చారన్నారు. 44 లేబర్ చట్టాలను 4 కోడ్‌లుగా మార్చేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లను జైలు పాలుజేసేందుకు పూనుకున్నారన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి కార్మికుల ఉద్యోగాలకు ఎసరు పెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో మోదీ, ఆయనకు మద్దతుగా నిలిచే టీడీపీ, జనసేన పార్టీలను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అంజిబాబు, నాగరాజు, బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

టీడీపీని వీడిన 100 కుటుంబాలు


మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్‌ఆర్‌సీపీలో చేరిన గుడిపాడుకు చెందిన టీడీపీ శ్రేణులు

- మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీ చేరిక

డోన్: ప్యాపిలి మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన వంద కుటుంబాల వ్యక్తులు టీడీపీని వీడి ఆదివారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేసిన అభివృద్ధి పట్ల ఆకర్షితులమై వైఎస్‌ఆర్‌సీపీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, గ్రామ నాయకులు చిన్నపుల్లారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మల్లికార్జున, ఉప సర్పంచ్ మధు, నారాయణ స్వామిల ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ గోవిందు, జక్కసానికుంట్ల క్రిష్ణ, ఓబులేసు, కొప్పుల నాయుడు, పరుశురాం, లక్ష్మీనారాయణ, గోపాల్, కొండా నరసింహులు, ఓబులేసు, రామచంద్రుడు, రాజా, మల్లికార్జునరెడ్డి, శరత్‌రెడ్డి, మహేష్, రమేష్, శ్రీనాథ్, జక్కల బాలరంగడు, మహేంద్ర, జక్కల మల్లికార్జున, రామ్మూర్తి, వెంకటేష్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో ప్యాపిలి మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరాంరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు గద్దం భువనేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఓల్డ్‌సిటీలోని శంకర మందిరంలో క్రోధి నామ ఉగాది తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేదిక సభ్యులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

స్టేడియంలో ప్లే ఫీల్డ్ పనులు ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం ప్లే ఫీల్డ్ పనులు ప్రారంభమయ్యాయి. వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ క్రీడలు జరుగుతున్న ప్రాంతాల్లో క్రీడాకారులకు సౌకర్యవంతంగా ఉండేందుకు నాణ్యమైన ఎర్రమట్టితో చదును చేస్తున్నారు. క్రీడాకారులకు దెబ్బలు తగలకుండా క్రీడాధికారులు ఈ చర్యలు తీసుకుంటున్నారు. పనులను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో మాట్లాడుతూ వేసవి సెలవులు ప్రారంభం కానుండటంతో స్టేడియానికి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో వస్తారని చెప్పారు.

పారదర్శక పాలనకు ఓటెయ్యండి

గూడూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న పారదర్శక పాలనకు ఓటు వేయాలని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ఓటర్లకు పిలుపునిచ్చారు. మండలంలోని కె.నాగలాపురంలో ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామానికి వచ్చిన వారికి స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పింఛన్ మంజూరుకు, ఇళ్ల స్థలాలకు ఇంత అని నిర్దేశించి పేదల నుంచి డబ్బులు దండుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం కేవలం అర్హత ఆధారంగా పథకాలు అంజేస్తున్నారని, జగనన్న పాలనలో జనం సంతోషంగా ఉన్నారని, ఆ సంతోషాన్ని కొనసాగించుకోవాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ మౌలాలి, నరసంహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి, గూడూరు చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న, సుందరం, నాగరాజు, కొండారెడ్డి, సుబ్బన్న, సురేష్, ఉమామహేశ్వరమ్మ, అజీ మా, శ్రీను, బీసీ మాదన్న, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ జియోలజిస్టుల దినోత్సవం

కర్నూలు (న్యూటౌన్): జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ జియోలజిస్టుల దినోత్సవాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డీడీ టి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి కోసం కొత్త ఖనిజ నిక్షేపాలు, బంగారు, బొగ్గు గనులను వెలికితీయడంతో జియోలజిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. జియోలజిస్టుల సేవలు ఎనలేనివని, విపత్కర పరిస్థితుల్లో ఎంతో మంది ప్రాణాలను ఫణంగా పెట్టారని, వారు చేసిన మేలును ఎల్లప్పుడూ స్మరించుకుంటామన్నారు.

ఓటరు నమోదుకు 16 వరకు దరఖాస్తులు స్వీకరణ

పాణ్యం : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఫణికుమార్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంకా ఎవరైన దరఖాస్తు చేసుకోనివారు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 16వ తేది వరకు దరఖాస్తులను పరిశీలించి సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు అనుమతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరైన ఓటుకు దరఖాస్తు చేసుకోకుంటే బీఎల్‌ఓలకు గాని, ఆన్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైద్యరంగంలో ప్రభుత్వ సేవలు ప్రశంసనీయం


నాయీబ్రాహ్మణుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు (టౌన్): వైద్యరంగంలో జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. ఆదివారం రాత్రి నందికొట్కూరు రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో ప్రముఖ వైద్యులు డాక్టర్ షేక్ ఉరఫ్ రహమతుల్లా ఆధ్వర్యంలో ముస్లింలకు, వైద్యులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. తర్వాత నాయీ బ్రాహ్మణుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డు జెడ్పీ సీఈఓ జయపాల్‌రెడ్డి, వైద్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీకి పారామెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సంపూర్ణ మద్దతు

నగరంలోని పారా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆదివారం స్థానిక ఎస్‌ఆర్ పేటలోని నగర పార్టీ కార్యాలయంలో ఇంతియాజ్‌ను కలిశారు. అత్యధిక మెజార్టీతో మిమ్మల్ని గెలుపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ మెడికల్ వృత్తి పరంగా ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ల్యాబ్ టెక్నీషియన్లకు హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో ల్యాబ్ టెక్నీషియన్లు, రెడ్ క్రాస్ సభ్యులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలికి అభినందనలు


సిట్రా సత్యనారాయణమ్మ దంపతులను శాలువాతో సత్కరిస్తున్న జిల్లా కురువ సంఘం నాయకులు

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన సిట్రా సత్యనారాయణమ్మను జిల్లా కురువ సంఘం నేతలు అభినందించారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, గద్దం రామకృష్ణ దంపతులకు జిల్లా కురువ సంఘం నాయకులు బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 4 లక్షల ఓటర్లు ఉన్న కురువలను గుర్తించి కురువ మహిళకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా పదవి ఇవ్వడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, సహాయ కార్యదర్శి కొత్తపల్లి దేవేంద్ర, కోశాధికారి కేసీ నాగన్న, పట్టణ అధ్యక్షులు తవుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్తమ జీవనానికి దిక్సూచి భగవద్గీత


సందేశం ఇస్తున్న ఇస్కాన్ ప్రవచనకారులు వైష్ణోకృప చైతన్య ప్రభు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భగవద్గీత దిక్సూచిలా నిలుస్తుందని కర్నూలు ఇస్కాన్ ప్రవచనకర్త వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్రామాయి, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలి


వైద్య పరీక్షలు చేయించుకున్న వృద్ధురాలిని పరామర్శిస్తున్న ఎస్ఎంబీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్‌బాషా

కర్నూలు (న్యూటౌన్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని ఎస్‌ఎంబీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్‌బాషా అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం కల్లూరులోని ముజాఫర్‌నగర్ విజ్ఞాన్ సుధ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కిమ్స్ హాస్పిటల్, సుశీల నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో ఎస్ఎంబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల జబ్బులతో బాధపడుతూ ఆసుపత్రులకు వెళ్లలేని స్థితిలో ఉన్న పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యజమాన్యాలు వ్యాపార కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో పేద ప్రజలకు రాయితీ కల్పిస్తూ వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో ప్రధానంగా వృద్ధులు, చిన్నపిల్లలు వివిధ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, కిమ్స్ హాస్పిటల్, సుశీల నేత్రాలయ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం


31వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాటసాని మాధవీలత

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుమార్తె మాధవీలత అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 31వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు ప్రస్తుతం జగనన్న అందిస్తున్న పాలనకు తేడా గమనించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చేందాలంటే ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చిట్టెమ్మ, అరుణ, నాయకులు తిరుపాల్, కృష్ణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

సి.బెళగల్: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పోలీస్ సిబ్బందితో మండలంలోని గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తిమ్మందొడ్డి గ్రామ సమీపంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సి.బెళగల్‌లో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

జగన్ పాలనలో మైనార్టీలకు మేలు


దువా చేస్తున్న కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థులు ఇంతియాజ్, కాటసాని, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ, ముస్లింలు

- ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కడదాం
- వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జిలానీ
- జొహరాపురంలో ఇఫ్తార్ విందు
- హాజరైన కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థులు

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల అండగా నిలబడుతూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జిలానీ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి స్థానిక 18 వ వార్డు పరిధిలోని జొహరాపురంలో ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ కర్నూలు, పాణ్యం అభ్యర్థులు ఇంతియాజ్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వీరంతా ముస్లింలతో కలిసి ప్రత్యేక దువా చేశారు. అనంతరం జిలానీ మాట్లాడుతూ జగనన్న వల్ల రాష్ట్రంలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. మైనార్టీలంతా జగనన్న వెంట ఉంటారన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఎందరో మైనార్టీలు పెద్ద చదువులు అభ్యసించే ఉన్నత స్థానాలకు చేరారన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్ మైనార్టీలకు అన్ని విధాలుగా తోడుగా నిలబడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయనను మరోసారి సీఎం చేసుకునేందుకు పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.